క్లుప్తంగా

రెండు రోజులు తాగునీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: ధర్మసాగర్ రిజర్వాయర్ మిషన్ భగీరథ ట్రంక్ లైన్ దెబ్బతిన్నందున మరమ్మత్తులు కొనసాగుతున్నాయని బల్దియా ఈఈ రాజయ్య తెలిపారు. దాంతో ఈనెల 17, 18వ తేదీల్లో వరంగల్ అండర్ రైల్వే గేట్ ప్రాంతంలో తాగునీటి సరఫరా బంద్ ఉంటుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ రైల్వే గేట్ జోన్ పరిధిలోని ప్రాంతాలైన తిమ్మాపూర్, కరీమాబాద్, పెరికవాడ, రంగశాయిపేట, ఉర్సు, శంభునిపేట, శివనగర్, ఖిలా వరంగల్, చింతల్, మామునూరు, సింగారం, బొల్లికుంట, బట్టుపల్లి, కడిపికొండ, రాంపేట, రాంపూర్, మడికొండ తదితర ప్రాంతాల్లో రెండు రోజుల పాటు నీటి సరఫరా ఉండదని ఈఈ రాజయ్య తెలిపారు.

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు



మడికొండ: మాస శివరాత్రిని పురస్కరించుకొని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం యాగశాలలో గణపతి హోమం, రుద్రహోమాలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రంతో కూడిన మాస శివరాత్రి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి శేషుభారతి, చైర్మన్ దువ్వ నవీన్, అర్చకులు రాగిచేడు అఖిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు చింతకుంట్ల భూపాల్‌రెడ్డి, కుమారస్వామి, ఓర్సు రాజు, బుర్ర సంధ్యారాణి, పెద్ది ప్రభాకర్, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి సాయం



హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో మృతి చెందిన మిత్రుడి కుటుంబానికి ఆర్థిక చేయూత నిచ్చారు. ఈమేరకు బాధిత కుటుంబానికి ఆదివారం రూ.10వేలు అందించారు. హసన్‌పర్తి మండలం జయగిరికి చెందిన యాటకాల శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా, అతని మిత్ర బృందం (2001 – 2002 ఎస్సెస్సీ బ్యాచ్) డబ్బులు సమకూర్చి బాధిత కుటుంబానికి అందజేసింది.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్త



హన్మకొండ చౌరస్తా: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి సూచించారు. హనుమకొండ 57వ డివిజన్‌లోని వాజ్‌పేయినగర్‌లో వర్మ స్పెషాలిటీ క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బీజేపీ నాయకుడు శివరాం నేతృత్వంలో జరిగిన వైద్య శిబిరంలో డాక్టర్ మధుకర్ హాజరై ప్రజలకు ఎఫ్‌బీఎస్, పీఎల్‌బీస్, షుగర్, బీపీ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అశోక్, తిరుపతిరెడ్డి, దినేష్, సతీష్‌రెడ్డి, భరత్, రూప్‌సింగ్, లక్ష్మణ్, గణేష్, రేవంత్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఎర్రబెల్లిని కలిసిన మార్నేని



హన్మకొండ చౌరస్తా: అమెరికా పర్యటన ముగించుకుని ఇటీవల వచ్చిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు నగరంలో ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మిద్దెతోట గ్రూపు సభ్యుల సమావేశం



హన్మకొండ కల్చరల్: ఉమ్మడి వరంగల్ జిల్లాల మిద్దెతోట గ్రూపు సభ్యుల సమావేశం హనుమకొండ రాంనగర్‌లోని కృష్ణ డేకర్స్‌లో ఆదివారం ఉదయం జరిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లా గ్రూపు నిర్వాహకుడు ఇమ్మడిశెట్టి ప్రభాకర్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మిద్దెతోట గ్రూపు సభ్యులు పాల్గొని పలు రకాల మొక్కల పరిచయం, మొక్కలకు వచ్చే తెగుళ్లు, నివారణ, కుండీల నిర్మాణం, మిద్దెతోట పెంపకంపై వంటి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కృష్ణ డేకర్స్ నిర్వాహకుడు చెన్న కిశోర్ హాజరైన సభ్యులకు కొత్త మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో శ్రవణ్‌కుమార్, అరుణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



హన్మకొండ చౌరస్తా: ఉపాధ్యాయినులతో పూర్వ విద్యార్థినులు



విద్యారణ్యపురి: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ ఛాత్రోపాధ్యాయులు

హన్మకొండ చౌరస్తా: సుమారు నాలుగు దశాబ్దాల క్రితం వారందరూ విద్యార్థినులు.. కాలచక్రం గిర్రున తిరిగింది.. వివాహాలు జరిగాయి.. ఉద్యోగాలు, వ్యాపారాల్లో చేస్తూ ఒక్కక్కరు ఒక్కోరంగంలో స్థిరపడిపోయారు. 44 సంవత్సరాల సుదీర్ఘ జీవన ప్రయాణంలో మరోసారి ఒకే వేదికపై వారందరు కలుసుకున్నారు. చిన్నపిల్లలుగా మారిపోయి పాఠశాల రోజులను గుర్తుచేసుకుని రోజంతా సందడిగా గడిపారు. 1978 – 79వ సంవత్సరంలో హనుమకొండ కుమార్‌పల్లిలోని పెట్రోల్‌పంపు బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థినులు హనుమకొండలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు హేమలత, స్నేహలత, శారద, పద్మావతిలను సన్మానించారు. పి.వాణిశేఖర్, జి.శకుంతల, రేవతి, సుధ, స్వర్ణలత, ఉష పాల్గొన్నారు.

పూర్వ ఛాత్రోపాధ్యాయుల సమ్మేళనం

విద్యారణ్యపురి: హనుమకొండలోని జిల్లా విద్యాశిక్షణ సంస్థలో చదువుకొని వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ ఛాత్ర ఉపాధ్యాయుల సమ్మేళనం.. శిక్షణ సంస్థలో ఆదివారం జరిగింది. 1998 – 1999వ బ్యాచ్‌కు చెందిన వివిధ జిల్లాలకు చెందిన 150మంది పూర్వ విద్యార్థులు హాజరై నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పటి గురువులు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ జగన్మోహన్, రత్నమాల, సోమయ్య, రాంబాబు, రవి కాంతారావు, పట్టాభి, వజ్రయ్య, అన్వర్‌అలీ, సర్వర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నాన్‌టీచింగ్ సిబ్బంది నయీం, శ్రీనివాస్, పూర్వ ఛాత్రోపాధ్యాయుల సమ్మేళనం నిర్వాహకులు శ్రీనివాస్, భిక్షపతి, రాంమూర్తి, పెద్దన్న, రవికిరణ్, శ్రీధర్, సంజీవ్, బాబురావు, పరశురాం, యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, గీతారాణి, మంజుల, రాణి, సునీత పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్ ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న సీనియర్ సిటిజన్లు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఆవరణలోని వెల్‌నెస్ సెంటర్ వద్ద వరంగల్ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్లు ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వేదిక అధ్యక్షుడు శంకర్‌రావు మాట్లాడుతూ వైద్య సేవలు, మందుల కోసం వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చే ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులు.. విద్యుత్ కోతల కారణంగా ఇక్కట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు వచ్చే వరకూ మందులు పొందలేని దుస్థితి నెలకొందని వాపోయారు. వెల్‌నెస్ సెంటర్‌లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

యాదవ యుద్ధభేరిని జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వేదిక బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: రాజకీయాల్లో యాదవుల వాటాను డిమాండ్ చేస్తూ వచ్చే నెల 13వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేపట్టిన యుద్ధభేరిని జయప్రదం చేయాలని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్ యాదవ్ పిలుపునిచ్చారు. హనుమకొండలోని శ్రీనగర్‌కాలనీలో ఉమ్మడి వరంగల్ జిల్లా యాదవ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు తుత్తూరి రవియాదవ్ అధ్యక్షతన ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్‌యాదవ్ మాట్లాడుతూ దేశంలో సామాజిక ఉద్యమాలు జరుగుతున్న నేపథ్యంలో తెలంగాణలో యాదవ జనాభా దామాషా ప్రకారం సామాజికంగా, రాజకీయంగా యాదవులకు ప్రాధాన్యం దక్కేలా ఐక్యంగా పోరాడాలని సూచించారు. అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోచబోయిన శ్రీహరి, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ బనుక సిద్దిరాజ్ మాట్లాడుతూ యుద్ధభేరికి యాదవులు తరలిరావాలని కోరారు. అనంతరం యుద్ధభేరి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఈదుల మల్లయ్య, గిరబోయిన రాజయ్య, బొల్లబోయిన కిశోర్, మేకల సంపత్, తోటకూరి పాండుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



ఖుష్‌మహల్‌లో భోజనం చేస్తున్న బీజేపీ నాయకులు



హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో..

ఖిలా వరంగల్: భారతీయ జనతా పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేయాలని ఆ పార్టీ నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పిలుపునిచ్చారు. బీజేపీ అధిష్టానం సూచన ప్రకారం ఖిలా వరంగల్ మధ్యకోటలోని ఖుష్‌మహల్ సమీపంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సద్దుల సమావేశంలో ప్రదీప్‌రావు మాట్లాడారు. సద్దుల సమావేశాలు దేశవ్యాప్తంగా ప్రారంభమయ్యాయని తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలపై చర్చించినట్లు వివరించారు.బీ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంట రవికుమార్, పొట్టి శ్రీనివాస్, కొప్పుల క్రాంతి, కందిమల్ల మహేష్, బాకం హరిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సద్దుల సమావేశం

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో ఆదివారం భారతీయ జనతా పార్టీ కార్యకర్తల సద్దుల సమావేశం జరిగింది. కార్యకర్తల మధ్య ఆత్మీయత, అనురాగాలు పెంపొందించడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పార్టీ అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి తెలిపారు.

ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటా..



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నాగరాజు

కరీమాబాద్: ఆపదలో ఉన్నవారికి సాధ్యమైనంత వరకు చేయూతనందిస్తానని ఐపీఎస్ రిటైర్డ్ అధికారి కెఆర్.నాగరాజు అన్నారు. మామునూరులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో 'మామునూరు క్యాంపు లైన్స్ బాయ్స్ – 2023' పేరిట గెట్ టుగెదర్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సర్వీసులో ఎంతో మందికి సహాయ సహకారాలు అందించానని చెప్పారు. మామునూరు బెటాలియన్ క్యాంపులో పుట్టి పెరిగిన వారందరం ఒకచోట కలుసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. క్యాంపులోని ప్రజలతో ఉన్న సంబంధాలు మరువలేనివని, అందరూ ఒక కుటుంబంలా ఉండడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈక్రమంలోనే క్యాంపు లైన్స్ బాయ్స్ పేరిట కార్యక్రమం నిర్వహిస్తుండడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో 44వ డివిజన్ కార్పొరేటర్ జలగం అనిత, బెటాలియన్ రిటైర్డ్ కమాండెంట్లు మోహన్, ప్రభాకర్‌తోపాటు రంజిత్, ఇసుగాల జోగిరెడ్డి, సాజిద్, ఇబ్రహీం, అలీమొద్దీన్, క్యాంపు సిబ్బంది, క్యాంపు బాయ్స్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు శ్రీరామానుజ ట్రస్ట్ చేయూత



కుట్టు మిషన్లు అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

కాజీపేట రూరల్: శ్రీరామానుజ ట్రస్ట్ ఆధ్వర్యంలో కాజీపేట ఫాతిమానగర్ చర్చి కమ్యూనిటీ హాల్‌లో పేదలకు రూ.6.50 లక్షల చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. వృద్ధులు, వితంతువులు, పేద విద్యార్థులకు ఆర్థికసాయం, ఉపకార వేతనాలు, కుట్టు మిషన్లు, మిక్సీ గ్రైండర్లు, హోటల్ సంబంధిత పనిముట్లను శ్రీరామానుజ ఫిలాసాఫికల్ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ మాచవరం వెంకటేశ్వర్లు అందజేశారు. 93 మందికి రూ.6.50 లక్షల విలువగల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10మంది దాతలు రూ.2.50 లక్షల నగదు ట్రస్ట్‌కు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతనిధులు వెంకటరమణ, పరావస్తు సురేష్, హరిపురం రవీంద్రనాథ్, నర్సింహస్వామి, వెంకటప్పనాథ స్వామి, తిరునహరి, సత్యనారాయణ స్వామి, శ్రీధర్, స్వర్ణలత, సరోజన, కృష్ణ, రూపవతి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ఓ వరంలాంటిది



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అదనపు డీసీపీ సంజీవ్, తదితరులు

హసన్‌పర్తి: చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ఒక వరం లాంటిదని అదనపు డీసీపీ పల్లెపాక సంజీవ్ అన్నారు. ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఎర్రగట్టు గుట్ట క్రాస్‌లోని బాలాజీ గార్డెన్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ శంకర్‌రావు మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు ఆగస్టు 10వ తేదీ చివరి గడువని వివరించారు. ఈ కార్యక్రమంలో కిట్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, కార్యదర్శి పుల్లా దుర్గారాం, కోశాధికారి లక్ష్మీనారాయణ, సభ్యులు బోడ యుగంధర్, బొక్క కుమార్, పావుశెట్టి వెంకటేశం, చకిలం చంద్రశేఖర్, రాంబాబు, భాస్కర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సహకరించండి



ఇన్‌స్పెక్టర్‌కు బొకే అందజేస్తున్న స్థానికులు

హసన్‌పర్తి: శాంతి భద్రతల విషయంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోపి కోరారు. హసన్‌పర్తి సీఐగా బాధ్యతలు స్వీకరించిన గోపిని స్థానికులు ఆదివారం కలిసి బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్, ఐనవోలు దేవస్థాన మాజీ ధర్మకర్త గిన్నారపు రవీందర్, ఎర్రగట్టు దేవస్థాన మాజీ చైర్మన్ పెద్దమ్మ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కడిపికొండ బొడ్రాయి ఆటోడ్రైవర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక



కాజీపేట అర్బన్: కడిపికొండ బొడ్రాయి అడ్డా శ్రీశ్రీశ్రీభూలక్ష్మి ఆటో డ్రైవర్స్ యూనియన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుజ్జెటి హనుమయ్య, ప్రధాన కార్యదర్శిగా బల్సు కూరి రవి, కోశాధికారిగా నర్మెట రాజు, ఉపాధ్యక్షుడిగా జిర్ర సతీష్, ప్రచార కార్యదర్శిగా జెట్టి రాంప్రసాద్, ముఖ్య సలహాదారులుగా మేకల సదానందం, నర్మెట మోహన్, గౌరవ అధ్యక్షుడిగా సాదినేని సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

యువకుడి మృతికి నివాళి

హన్మకొండ చౌరస్తా: రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన హనుమకొండ గాంధీనగర్‌కు చెందిన రాకేష్‌కుమార్ గౌడ్ భౌతికకాయాన్ని డీసీసీ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, నాయకులు సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ఖిలా వరంగల్: తెలంగాణ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సూచించారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డు పెరికవాడలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌ను హనుమకొండ మొదటి అదనపు జిలాల కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన సీనియర్ న్యాయవాది సిరబోయిన శ్రీనివాస్ ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

వరంగల్ చౌరస్తా: వరంగల్ 27వ డివిజన్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌లో రూ.20 లక్షలతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆదివారం శంకుస్థాపన చేశారు.

కాశిబుగ్గ: మున్నూరుకాపుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల అభివృద్ధికి రూ.50 కోట్లు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమేష్

హసన్‌పర్తి: విలీన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేసిందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. 56వ డివిజన్‌లో సుమారు రూ.2.25 కోట్ల వ్యయంతో చేపట్టిన, చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆదివారం ప్రారంభోత్సవం, భూమి పూజ చేశారు. పరిమళ కాలనీలో రూ.8.5 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అభివృద్ధి పనులు, సప్తగిరికాలనీలో రూ.9.30 లక్షల ఖర్చుతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే, పరిమళ కాలనీలో సుమారు రూ.85 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పార్కును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 31గ్రామాలు కార్పొరేషన్‌లో విలీనమయ్యాయని వివరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు మణీందర్‌నాథ్, బీఆర్‌ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి లోకిని చందర్, మాజీ కోఆప్షన్ సభ్యుడు పాషా, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ మార్గం అనుసరణీయం

డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చూపిన మార్గం అనుసరణీయమని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. హసన్‌పర్తి మండలం దేవన్నపేటలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచన విధానం నేటి తరానికి ఆదర్శమని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుగులోతు దివ్యారాణి, మాజీ కార్పొరేటర్ గుగులోతు రాజునాయక్, పీఏసీఎస్ చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్ రెడ్డి, ఆత్మ డైరెక్టర్ పంజాల భూపాల్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు పుట్ట రవి, చుంచు రాజేందర్, మాజీ సర్పంచ్ చుంచు రవి, నిర్వాహకులు మైకేల్, సందెల చిన్న, పీఏసీఎస్ డైరెక్టర్లు విజేందర్, వాసుదేవ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు సుధన్, కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు భాస్కర్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రూ.1,00,116 విరాళం

హసన్‌పర్తి మండలం సీతంపేట గ్రామ శివాలయ అభివృద్ధికి ఎమ్మెల్యే అరూరి రమేష్ విరాళం అందజేశారు. ఈమేరకు రూ.1,00,116లను అభివృద్ధి కమిటీకి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రజిత, ఉపసర్పంచ్ భగవాన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు బండారి చేరాలు, చిర్ర తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అన్ని మతాలకు సమ ప్రాధాన్యం

వరంగల్: తెలంగాణలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని మతాలు, కులాలకు సమ ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. మూడో డివిజన్ ఆరెపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న మసీదు నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జన్ను షీబారాణి, బీఆర్‌ఎస్ నాయకులు జన్ను అనిల్‌కుమార్, హరికృష్ణ, రాజు, బొల్లం విజయ్, నాయకులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులు సంఘటితం కావాలి



బ్రాహ్మణ శంఖారావం ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సత్యమోహన్, గంగు ఉపేంద్రశర్మ

హన్మకొండ కల్చరల్: బ్రాహ్మణులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి బ్రాహ్మణ సమాజం సంఘటితం కావాలన్నదే బ్రాహ్మణ శంఖారావం ముఖ్య ఉద్దేశమని బ్రాహ్మణ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు అయినవోలు వెంకట సత్యమోహన్ అన్నారు. హనుమకొండ బ్రాహ్మణవాడలోని బ్రాహ్మణ భవనంలో శ్రీలలితా గాయత్రి బ్రాహ్మణ సహకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వెంకట సత్యమోహన్, సేవా సమితి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, తదితరులు పాల్గొని ఈనెల 23న హుజూరాబాద్‌లో పలుబ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే బ్రాహ్మణ శంఖారావం ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వెంకట సత్యమోహన్ మాట్లాడుతూ శంఖారావానికి గ్రామీణ ప్రాంతాల్లోని ధూప, దీప నైవేద్య పథకం అర్చకులు, బ్రాహ్మణులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల తూర్పు నియోజక వర్గ ఇన్‌చార్జ్ వద్దిరాజు గణేష్, శ్రీవైష్ణవ సేవా సమితి నాయకులు జీవీఎస్ శ్రీనివాసాచారి, శ్రీలలితా గాయత్రి సంఘం అధ్యక్షుడు చకిలం సుధాకర్, సేవా సమితి రాష్ట్ర కన్వీనర్ వల్లూరి పవన్‌కుమార్, జయప్రసాద్‌రావు, ఏవీ.నరసింగరావు, విజయలక్ష్మి, శ్రీదేవి, మంజుల, విన్నకోట రాజ్‌కుమార్, హరిప్రసాద్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



ఆత్మగౌరవ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉద్యమకారుల ఫోరం బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసి రూ.10వేల కోట్లు కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 20వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో నిర్వహించనున్న ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలపార్కు వద్ద ఆదివారం జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించాలని సూచించారు. ఫోరం జిల్లా చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ ఉద్యమకారులకు ఉద్యోగాలలో 20శాతం కోటా కేటాయించాలని, ప్రతీనెల పెన్షన్, బస్సు, రైలు పాసులు, ఆరోగ్య కార్డు సౌకర్యంతో పాటు సంక్షేమ పథకాలలో 20శాతం కేటాయించాలని కోరారు. సమావేశంలో ఫోరం నాయకులు సుదర్శన్, ఓదెలు, జ్యోతిరెడ్డి, రవీందర్, సంపత్ పాల్గొన్నారు.

ఉర్సులో ఘనంగా బోనాల సందడి



ఉర్సులో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



బీరన్ననగర్‌లో..



బోనాల వేడుకల్లో ఆపిల్ స్కూల్ చిన్నారులు

కరీమాబాద్: ఆషాఢ మాసం చివరిరోజు కావడంతో ఆదివారం ఉర్సులో బోనాల సందడి నెలకొంది. మహిళలు బోనాలతో తరలివచ్చి ఉర్సులోని గ్రామ దేవత (బొడ్రాయి)కు మొక్కులు చెల్లించుకున్నారు. డప్పుచప్పుళ్లతో మహిళలు గుంపులు గుంపులుగా తరలి రావడంతో సందడిగా మారింది. కార్యక్రమంలో 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి, బొడ్రాయి కమిటీ అధ్యక్షుడు ఆమంచ శ్యాంసుందర్, దాసి రాందేవ్, అడ్లూరి రాజు, వనం కుమార్, రాజన్‌బాబు, గౌతం, సుధాకర్, నవీన్, రవి, లక్ష్మణ్‌రావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బీరన్ననగర్‌లోని మైసమ్మకు..

బీరన్ననగర్‌లోని ప్రజలు మైసమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు బోనాలతో తరలివచ్చి మైసమ్మకు నైవేద్యం సమర్పించారు. కాగా, మైసమ్మకు గుడి నిర్మాణానికి తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ చొరవతో రూ.5 లక్షలు మంజూరు అయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని కార్పొరేటర్ మరుపల్ల రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో యాకయ్య, సుధాకర్, వేణు, అఫ్జల్, రాధ, శ్వేత, రజిత, సరిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆపిల్ స్కూల్‌లో..

కాజీపేట రూరల్: కాజీపేట బాపూజీనగర్‌లోని ఆపిల్ ప్లే స్కూల్‌లో బోనాల పండుగ వేడుకలు ఆదివారం జరిగాయి. బోనాల పండుగ విశిష్టతను విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి వివరించారు. విద్యార్థులు అమ్మవారు, పోతురాజు వేషధారణలో ఆకట్టుకున్నారు. స్కూల్ డైరెక్టర్ రాజు, రమ్య, అరుణ, శ్రావణి పాల్గొన్నారు.